ఆయిల్‌పాం వైపు..రైతుల చూపు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆసక్తి
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాంసి: జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటలకు దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఎప్పుడు ఒకే రకమైనవి కాకుండా మారుతున్న కాలానికనుగుణంగా దీర్ఘకాలిక పంటల సాగుకు ఒక్కొక్కరుగా అడుగులు వేస్తున్నారు. ఆయిల్‌పాం సాగు చేస్తే 25 ఏళ్ల రాబడి వచ్చే అవకాశం ఉండడంతో మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో వివిధ నేలలు ఈ పంట సాగుకు అనుకూలమని గతప్రభుత్వం గుర్తించి మొక్కల పెంపకం చేపట్టింది. ఎర్రమట్టి, నల్లరేగడి తదితర భూముల్లో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. నీటివసతితోపాటు తేమశాతం అధికంగా ఉండే భూములు ఈ పంటకు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 మొక్కల వరకు నాటవచ్చు. మొక్కల మధ్యలో పత్తి, సోయా, కంది సాగు చేయవచ్చు.

సబ్సిడీపై మొక్కలు, నిర్వహణకు సాయం

ఆయిల్‌పాం సాగు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేస్తోంది. పంటకు నీటితడులు అందించడానికి అవసరమయ్యే డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం,బీసీలకు 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ప్రతీఏడాది నిర్వహణ కోసం ఎకరాకు రూ.4200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై ఏటా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

2వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో గతంలో రైతులు జామ, నిమ్మ, మామిడి, సీతాఫల్ పండించేవారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై వారికి అవగాహన కల్పించారు. సాగుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు చేసుకుని శిక్షణ ఇచ్చారు. జిల్లాలో రెండేళ్లలో 1,987 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగైంది. 2021–22 సంవత్సరంలో 338 మంది 1147 ఎకరాల్లో సాగు చేయగా, 2022–23 సంవత్సరంలో అధికారులు 3,400 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటివరకు 287 మంది 843 ఎకరాల్లో మొక్కలు నాటారు. మరో 406 మంది 1128 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు భూములను సిద్ధం చేశారు.

ప్రతీ రెండు మండలాలకు అధికారి

ప్రతీ రెండు మండలాలకు ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ నుంచి ఫీల్డ్ క్లస్టర్ అధికారి అందుబాటులో ఉంటారు. జిల్లా ఉద్యానశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తారు. మొక్కలు నాటేందుకు చేలల్లో కొలతలు, పెంపకంలో జాగ్రత్తలను తెలియజేస్తారు. సబ్సిడీ మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్లస్టర్ అధికారులు చేల వద్ద వాటిని అందించి, వారికి సూచనలు ఇస్తారు.



హస్నాపూర్ శివారులో సాగవుతున్న ఆయిల్‌పాం

11 ఎకరాల్లో సాగుచేశా



గతేడాది 11 ఎకరాల్లో ఆయిల్ పాం సాగుచేశాను. ప్రస్తుతం పంట మధ్యలో పత్తి, సోయా వేశాను. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయని ఆయిల్ పాం సాగుచేశాను. మన పక్కనున్న జిల్లాలో ఆయిల్‌పాం ప్యాక్టరీ ఏర్పాటు చేయడంతో సాగు చేసే రైతులకు లాభం.– రాంరెడ్డి, రైతు, కజ్జర్ల

మంచి ఆదాయం

ఆయిల్‌పాం సాగు చేస్తే నాలుగేళ్లలో పంట చేతికి వస్తుంది. ఆ తర్వాత దిగుబడి మొదలై ఎకరాకు రూ.లక్ష నుంచి 2లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ పంటకు డిమాండ్ ఉంది. అడవి జంతువుల బెడద ఉండదు. వచ్చే సంవత్సరంలో సాగును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

త్వరలో సికిల్‌సెల్ శిబిరాలు

- రెండు మూడురోజుల్లో ప్రారంభం
- 25 జనవరి వరకు కొనసాగింపు
- రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తింపు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో ఆదిలాబాద్ రూరల్, మావల మండలంలో 37 పంచాయతీలు ఉండగా 13 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించేందుకు త్వరలో సికిల్‌సెల్ శిబిరాలు ప్రారంభించనున్నారు. 0 నుంచి 18 ఏళ్ల వయస్సు, 18 నుంచి 45 ఏళ్ల గల వారి రక్త పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలలో చదువుతున్న పిల్లల రక్తనమూనాలు సేకరించి వారిలో ఉన్న హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలిస్తారు.

రక్తశాతం తక్కువ ఉంటే చికిత్స

ప్రధానంగా బాలికలకైతే సుమారు 12 శాతానికిపైగా, బాలురైతే 13 శాతానికిపైగా శరీరంలో హిమోగ్లోబిన్ ఉండాలి. వారిలో హెచ్‌బీ తక్కువగా ఉండి రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించినంతరం వారికి మాత్రలు ఇవ్వడం, ఇంజక్షన్లు ఇవ్వడం వంటివి చేయనున్నారు. మరి ఎక్కువగా హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటే అలాంటి వారికి రక్తం సైతం ఎక్కించే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

దశలవారీగా శిబిరాలు

ఈ శిబిరాల్లో భాగంగా ఏఎన్‌ఎంలు వారి వారి సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో విడతల వారీగా శిబిరాలు నిర్వహించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. బుధ, శనివారాల్లో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలు మినహాయించి మిగతా రోజుల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. వారికి ఇచ్చినా టార్గెట్ గడువులోగా ఈ శిబిరాలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దిశగా ఏఎన్‌ఎంలు సిద్ధమవుతున్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

ఇది వరకే శిక్షణ

త్వరలో ప్రారంభం కానున్న సికిల్‌సెల్ శిబిరాలు 25 జనవరి 2024 వికాసిత్ భారత్ సంకల్పయాత్ర వరకు కొనసాగనున్నాయి. అందులో భాగంగానే జిల్లాస్థాయి అధికారులు మండలస్థాయి వైద్యులకు శిక్షణ ఇచ్చారు. వారు తమ పరిధిలోని ఏఎన్‌ఎం, ఆశలు, సూపర్‌వైజర్లకు శిక్షణ సైతం అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే సికిల్‌సెల్ శిబిరాలు నిర్వహించనున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే

సికిల్‌సెల్ శిబిరాలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు తమకు శిక్షణ అందజేశారు. తమ పరిధిలోని ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్, ఆశలకు శిక్షణ అందజేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే రెండు, మూడురోజుల్లో శిబిరాలు ప్రారంభిస్తాం.

– డాక్టర్ సర్ఫారాజ్, మండల వైద్యాధికారి, ఆదిలాబాద్‌రూరల్

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పల్లకి మోస్తున్న ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్

జైనూర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శ్రీ మాతంగ్ ఋషి గజానంద్ మావులి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న గాదిగూడ మండల కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం జైనూర్ మండలం జంగాం ఘాట్ హనుమాన్ ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ పల్లకి మోసి పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం జంగాం ఘాట్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, దత్తా మహరాజ్, భక్తులు తదితరులు ఉన్నారు.

బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరికొండ: 'బస్సే రాదాయే' శీర్షికన సాక్షిలో కథనం సోమవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండలానికి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పనను కలిశారు. వినతిపత్రం అందజేయగా ఆమె సానుకూలంగా స్పందించారు. నాయకులు పెంటన్న, తోకల చందు, రోహిదాస్, రాజన్న, లతీఫ్ తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో సత్తా



పతకాలతో విద్యార్థినులు

బోథ్: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు కరాటే పోటీల్లో సత్తా చాటారు. కాగజ్‌నగర్‌లో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్(షీటోరియో కరాటే) పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మొత్తం 12 మంది విద్యార్థినులు పాల్గొనగా ఆరు (స్వర్ణ), ఆరు (రజత) పతకాలు సాధించినట్లు ప్రత్యేకాధికారి రాథోడ్ వలిత పేర్కొన్నారు. పీఈటీ పుష్పలత, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

గోదావరిని ఆదర్శంగా తీసుకోవాలి



సన్మానిస్తున్న వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ యూనుస్ ఆక్బానీ

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉన్నత విద్యనభ్యసించి కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన బానోత్ గోదావరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ యూనుస్ ఆక్బానీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి భవిష్యత్తులో మరింత ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు ఎంఐఎం మండల అధ్యక్షుడు బాబాఖాన్, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి సయ్యద్‌ఖాశీం తదితరులు ఉన్నారు.

ముగిసిన ధ్యానమందిర వార్షికోత్సవం

బేల: మండలంలోని జూనోని గ్రామంలో పూలాజీబాబా ధ్యానమందిర 19వ వార్షికోత్సవ ముగింపు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానవీధుల గుండా ఆయా గ్రామాల భజన మండలి సభ్యులు భజన, కీర్తనతో ర్యాలీ చేపట్టారు. భగవద్గీత, ఇతరత్ర ఆధ్యాత్మిక గ్రంథాలతో పల్లకీ ఊరేగింపు చేపట్టారు. తర్వాత స్థానిక హనుమన్ ఆలయ ఆవరణలో పూలాజీ బాబా ప్రధాన శిష్యుడు తుకరాం యాదవ్ భక్తులతో ధ్యానం చేయించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ వాడయి వివేక్, ఉపసర్పంచ్ మోర్లే మంగేశ్, నిర్వాహకులు నాగోసే మురళీధర్, రుషి, లెన్‌గురే భాస్కర్, గుర్నులే సురేష్, పుసాం రితేష్, షిండే దీపక్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: శౌర్య దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో మహా ప్రజ్ఞ బుద్ధ విహార్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 1న బీమా కోరేగావ్ శౌర్యదినాన్ని పురస్కరించుకుని స్తూపం వద్ద మానవ వందనం కార్యక్రమానికి బౌద్ధ ఉపాసక, ఉపాసికులు, అంబేద్కర్ వాదులు తరలిరావాలని కోరారు. భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రత్నాజాడే ప్రజ్ఞ కుమార్, మహా ప్రజ్ఞా డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు ఆర్. ఉదయ్‌కుమార్, జాబాడే రాష్ట్రపాల్, సుభాష్, దమ్మపాల్, జితేందర్, అన్నారావు, ప్రమోద్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యేను కలిసిన టీజీఓ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. శివకుమార్, అనిల్, భూమయ్య, వామన్‌రావు, విజయ, నవీన్, అరుణ, వేణుగోపాల్‌రెడ్డి, మధుసూదన్ ఉన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

'దళితదెబ్బ' నిరసనలు నిలిపివేయాలి

ఇచ్చోడ: దళితదెబ్బ పేరుతో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను నిలిపివేయాలని ఆదివాసీ యువసేన నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక ఎస్సై నరేశ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతమైన నార్నూర్ మండలంలో కొందరు దళితదెబ్బ పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేపడుతున్న నిరసనలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న నార్నూర్‌లో నిర్వహించే గిరిజనేతరుల నిరసన కార్యక్రమాన్ని నిలుపదల చేయాలన్నారు. నాయకులు చాకటి రమేశ్, సెడ్మకి మల్లేశ్, కాత్లె సంతోష్, చాకటి పవన్, చాకటి చంద్రకాంత్, కాత్లెప్రహ్లద్ ఉన్నారు.



ఎస్సై నరేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సేన నాయకులు

'ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు'

బేల: మహారాష్ట్ర నుంచి 1950 తర్వాత వలసవచ్చిన లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సిడాం నందకుమార్, రాయిసెంటర్ మండల అధ్యక్షుడు కొరంగే సోనేరావు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివాసి సంఘాల జెఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సవాయ్‌సింగ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కొరంగే జంగ్‌షా, నాయకులు ఆత్రం ఫక్రు, పెందుర్ రాందాస్, మడావి చంద్రకాంత్, మేస్రం జంగు, జుగాదిరావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ నాయకులు

సూర్యపుత్ర యశ్వంత్‌రావు అంబేద్కర్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో సూర్యపుత్ర యశ్వంత్‌రావు అంబేద్కర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ ఏకైక పుత్రుడు యశ్వంత్‌రావ్ అంబేద్కర్ జయంతిని జిల్లాలోని ప్రతి బౌద్ధ విహార్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా నాయకులు కాంతారావు వాగ్మారే, అన్నరావు టిక్టే, విఠల్ బుక్టే, అనిల్ సాడ్వే, రవీందర్ జీవనే, దయానంద్ సర్వడే, కుష్వర్త లాంఢ్గే, క్రమపాల దగ్గడే, మాయావతి ససాని, ఉజ్వల ధూడే పూజా థాయిడే, రత్నజాడే ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో స్టోన్‌క్రషర్ సమీపంలో అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఆయన పూజలు చేశారు. అనంతరం లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా మండలానికి వచ్చానని పేర్కొన్నారు. గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలి పారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు ప్రవీణ్, సుమన్లు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, మెట్టి కిరణ్ కుమార్, పల్లవి, సర్పంచులు మహేందర్ యాదవ్, పోతారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హోదాలో వచ్చా.. హామీలు నెరవేరుస్తా

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్, మాన్కాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. మొదటగా లింగాపూర్‌కు చేరుకున్న ఆయన సప్తాహం ముగింపులో పాల్గొని మాట్లాడారు. మండలంలో ఏ అభివృద్ధి కార్యక్రమమైనా లింగాపూర్ నుంచే ప్రారంభిస్తానని చెప్పానని, గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఇక్కడకు తొలిసారిగా ఎమ్మెల్యే హోదాలో వచ్చానని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తానన్నారు. అనంతరం మాన్కాపూర్‌లోని పూలాజీ బాబా ఆశ్రమానికి చేరుకుని పూజలు చేశారు. కాగా నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం మండలంలో తొలిసారిగా పర్యటించడంతో గ్రామస్తులు అనిల్ జాదవ్‌ను సన్మానించారు. ఆయన వెంట సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, సర్పంచులు జాడి సుభాష్, తొడసం భారతీమహేష్, కోఆప్షన్ సభ్యుడు జమీర్, మాజీ ఆర్మీ జవాన్ పోలే యాదవ్ పాల్గొన్నారు.



తలమడుగు: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



గుడిహత్నూర్: లింగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అటవీ శాఖ అవుట్ సోర్సింగ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాన్ని అందజేశారు.

అభివృద్ధికి సహకారం అందించాలి

ఇచ్చోడ: మండల అభివృద్ధికి అధికారులు సహకారం అందించాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఎంపీడీవో రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మంగళవారం సన్మానించారు. ఎంపీవో రమేశ్, ఇచ్చోడ మేజర్ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, బిల్‌కలెక్టర్ గంగారాం, కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలి

బోథ్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం బోథ్‌కు వచ్చిన కలెక్టర్.. స్థానిక జెడ్పీ సెకండరీ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గణితశాస్త్రంలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలకు రాని వారి ఇంటికి వెళ్లి వారిని వచ్చేలా చూడాలని టీచర్లకు సూచించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ సుభాష్ చందర్ ఉన్నారు.



విద్యార్థి సామర్థ్యాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలంలోని గిరిజన గ్రామమైన రాజుల్‌వాడీలో రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కరంజి(టి) పంచాయతీ పరిధిలోని రాజుల్‌వాడీ గ్రామానికి మట్టిరోడ్డు నిర్మాణానికి ఎంపీ సోయం బాపూరావ్ తన నిధులు రూ.2.5 లక్షలు కేటాయించారు. స్థానిక సర్పంచ్ నరేందర్, ఎంపీటీసీ రెడ్డివార్ రమేశ్‌తో కలిసి బీజేపీ మండల నాయకులు రోడ్డు పనులు ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, జిల్లా నాయకుడు దేవారెడ్డి, మండల నాయకులు నారాయణ, వెంకటేశ్, దత్తు, అశోక్, గ్రామస్తులు ఉన్నారు.



ప్రారంభిస్తున్న నాయకులు

15 నుంచి యోగా శిక్షణ

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో ఈనెల 15 నుంచి సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యోగా శిక్షకుడు తిరుపతిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవనాలు కూల్చడానికి కొటేషన్ నోటిఫికేషన్

బోథ్: మండల కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న కోర్టు భవనం, జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి క్వార్టర్ భవనాలు కూల్చడానికి జిల్లా సెషన్ కోర్టు నుంచి మంగళవారం కొటేషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 13న సాయంత్రం 5 గంటలలోగా సీల్డ్ కవర్‌లో కొటేషన్‌ను జిల్లా సెషన్ కోర్టులో అందించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కడెం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరవాలని కోరారు.

'దుష్ప్రచారం సరికాదు'



మాట్లాడుతున్న గంగారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సొంత లాభం కోసం పార్టీ మారిన నాయకులు బీఆర్‌ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం సరికాదని జిల్లా అధికార ప్రతినిధి గంగారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ మంజూరు కోసం అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గోవర్ధన్‌రెడ్డి డబ్బులకు అమ్ముడుపోయాడని, పార్టీపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు శివకుమార్, ధమ్మపాల్, అజయ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లోహార గ్రామ సర్పంచ్ సోము తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మాదస్తు పొశెట్టి తండ్రి రాజారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ గండ్రత్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు కుమ్ర రాజు, సేవ్వా జగదీశ్, రమణ, తదితరులు ఉన్నారు.